క్లుప్తంగా

ఉచ్చప్పతాత 61వ పుణ్యారాధన


పూజలందుకున్న ఉచ్చప్పతాత

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఉచ్చప్పతాత 61వ పుణ్యారాధన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగపూజ, నందికోలు, రుద్రాక్ష పూజ చేపట్టారు. కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి చిన్నారుల ఆధార్ నమోదు

హొళగుంద: ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే 0–6 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు చేసేందుకు ఆయా సచివాలయాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయలలిత సోమవారం తెలిపారు. 21న చిన్నహ్యాట సచివాలయంలో చిన్నహ్యాట, బీజీ హళ్లి గ్రామాల చిన్నారులకు, పెద్దహ్యాట 22, 23 తేదీల్లో నెరణికి సచివాలయంలో నెరణికి, నెరణికి తండా, కొత్తపేట వారికి, 24న సుళువాయి సచివాలయంలో సుళువాయి అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు, 21, 22, 23 తేదీల్లో హొళగుంద-3 సచివాలయంలో హొళగుంద 2, 9వ అంగన్‌వాడీ సెంటర్లు,24న అదే సచివాలయంలో హెబ్బటం అంగన్‌వాడీ పిల్లలకు ఆయా సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు ఆధార్ నమోదు చేస్తారని ఆమె వెల్లడించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాలను అభివృద్ధి చేస్తాం

కృష్ణగిరి: పత్తికొండ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తెలిపారు. సోమవారం మండలంలోని ఆగవేలి, రామకృష్ణాపురం, ఎస్‌హెచ్ ఎర్రగుడి, మన్నెకుంట గ్రామాల్లో పల్లెపండుగ కింద నిర్మించిన సీసీ రహదారులను, గోకులం షెడ్లను ప్రారంభించారు. ఆగవేలిలో పశు ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించి, పశుపోషకులకు ఉచితంగా మందులు అందించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే రూ.2కోట్లతో సీసీ రహదారులు వేశామన్నారు. మరో రూ.కోటితో మరిన్ని రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. అనంతరం కంబాలపాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి విలేకరులతో మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ కర్నూలు డీడీ దుర్గా ప్రసన్న బాబు, పీఆర్ డీఈ శేషయ్య, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏపీఓ నాగసులోచన, పశువైద్యాధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

పత్తికొండ(తుగ్గలి) : న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా సభ్యుడు సూరజ్‌నబి అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో 2025 పాకెట్ క్యాలెండర్‌ను సీనియర్ న్యాయవాదులతో కలిసి ఆవిష్కరించారు. న్యాయవాదులు మైరాముడు, లక్ష్మన్న, పంపావతి, నగేష్, మల్లి, వెంకటేశ్వర్లు, మధు, వాసుదేవ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ టీచర్లకు శిక్షణ


మార్గదర్శి బుక్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ గౌరీదేవి, అధికారులు

దేవనకొండ: స్థానిక మండల మహిళా సమాఖ్య స్త్రీ శక్తి భవనంలో ఉల్లాస్ రెండో విడత శిక్షణ కార్యక్రమంలో భాగంగా వలంటీర్ టీచర్లకు ఇచ్చినట్లు ఎంపీడీఓ గౌరీదేవి సోమవారం తెలిపారు. ఈ ట్రైనింగ్‌లో ఒక వలంటరీ టీచర్ 10 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే బాధ్యతలు అప్పగించామన్నారు. మూడు నెలల కాలంలో వారిని ఎలా అక్షరాస్యులుగా చేయాలో ఎంపీడీఓ, ఏపీఎం నరసన్న, కర్నూలు నుంచి వచ్చిన వయోజన విద్య సూపర్‌వైజర్ ఫయాజ్ అవగాహన కల్పించారు. అనంతరం మార్గదర్శి బుక్స్‌ను పంపిణీ చేశారు.

దరఖాస్తు చేసుకోండి

ఆలూరు: ఐసీడీఎస్ ఆలూరు ప్రాజెక్టు పరిధిలోని ఆలూరు, చిప్పగిరి, హొళగుంద మండలాల్లోని ఖాళీగా ఉన్న 4 అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు 8 ఆయా పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఐసీడీఎస్ సీడీపీఓ కేవీ.బాలమణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యకర్త పోస్టుకు 10వ తరగతి పాసై ఉండి 2024 జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. ఆయా పోస్టుకు 7వ తరగతి ఉత్తీర్ణులై, 2024 జూలై 1నాటికి 21 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 28వ తేదీలోగా ఆలూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ఏపీజీబీ కార్యాలయాన్ని తరలించొద్దు

తుగ్గలి : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించొద్దంటూ సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు రైతులతో కలిసి సోమవారం జొన్నగిరి ఏపీజీబీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడున్న సంస్థలను తరలించాలనుకోవడం సిగ్గుచేటన్నారు.



రూమ్ బాడుగ కట్టలేక పోతున్నామంటున్న ఈ యువకుడి పేరు బి. హనుమంతు, నిట్రవట్టి గ్రామం. 'నేను డిగ్రీ పూరి చేసి పది నెలలు అయ్యింది. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క నోటిఫికేషన్ రాలేదు. ఇప్పటికి నేను తిరుపతిలో కోచింగ్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్నాను. రూం బాడుగ, కోచింగ్ సెంటర్‌కు డబ్బులు చెల్లించలేక పోతున్నాం. ఇంట్లో వారికి కుటుంబ గడవడమే కష్టంగా మారింది.ఇక మా ఖర్చులు భరించాలంటే వారికి అదనపు భారంగా మారింది. ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యగమంటూ ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఒక్క నోటిఫికేషన్ కూడా విడదల చేయలేదు. ఖర్చుల కోసం పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుందామంటే.. పోటీ పరీక్షల్లో మంచి మార్కులు సాధించలేమని ప్రిపేర్ అవుతున్నా. నిరుద్యోగుల సమస్యలను గుర్తించి ఉద్యోగాల నోటిఫికేషన్ ఇవ్వాల'ని కోరుతున్నాడు.



ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నామంటున్నాడు గూళ్యం గ్రామానికి చెందిన చెనప్ప. 'నాది డిగ్రీ పూర్తయ్యింది. ఇంటికో ఉద్యోగం ఇస్తామనడంతో ఆశతో కోచింగ్ తీసుకుంటున్నా. ఎన్ని రోజులు గడిచినా నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఖర్చులకు చేతిలో డబ్బులు లేవు. కోచింగ్ మానుకుందామనుకుంటే.. వెంటనే నోటిఫికేషన్ వస్తే.. పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తాయోమోనని ఇబ్బందులు పడుతూ ప్రిపేర్ అవుతున్నాం. ఉద్యోగాలు కల్పించకపోతే నిద్యోగభృతి ఇస్తామన్నారు. అదైనా ఇస్తే ఉద్యోగం సాధించుకునేంత వరకు కొంత ఊరట లభిస్తుంద'ని పేర్కొంటున్నాడు.

ఉద్యోగమేదన్నా..?

- ఏడు నెలలు గడిచినా పోస్టుల భర్తీ చేపట్టని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం అంటూ హామీ
- ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటన
- ఆర్థిక పరిస్థితిని సాకుగా చూపుతున్న చంద్రబాబు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న నిరుద్యోగులు


ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు

> ''యువత కలలను సాకారం చేసే బాధ్యత నాది.. కూటమి ప్రభుత్వం అధికారంలో వస్తే ఇంటికో ఉద్యోగం కల్పిస్తాం, యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగులకు నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి చెల్లిస్తాం. యువతకు నేనిచ్చే ఇదే అద్భుతమైన కానుక. తమ్ముళ్లూ.. కూటమిని గెలిపిస్తే ఇవన్నీ నెరవేరతాయని గుర్తుంచుకోండి
> – ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ''

హాలహర్వి: ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు నిరుద్యోగులకు ఇచ్చిన హామీ..అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనప్పటికీ నెరవేరకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. నాడు వారిలో ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ ఆశలు రేకెత్తించి ఓట్లు దండుకున్నా నాయకులు నేడు వాటి అమలు ఊసే ఎత్తడం లేదు. నాడు వారిని పావులుగా వాడుకుని ఆశల పల్లకిలో ఊరేగించి, ఇప్పుడు ఆర్థిక స్థితిని బూచీగా చూపి నిరుద్యోగులను నట్టేట ముంచేందుకు చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్నికల ముందు చంద్రబాబు అండ్ కో ఇచ్చిన ఉమ్మడి మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పేరుతో ఊదరగొట్టారు. కీలక వాగ్దానమైన నిరుద్యోగభృతి, ఇంటికో ఉద్యోగంపై నోరెత్తడం లేదు. ప్రధానంగా నిరుద్యోగులకు పెద్దపీట వేస్తామంటూ నమ్మించి నిరుద్యోగులకు ఉద్యోగం వచ్చేవరకూ ప్రతినెలా రూ.3 వేలు నిరుద్యోగభృతి ఇస్తామని భరోసా ఇచ్చారు. మండలంలో డిగ్రీ పూర్తి చేసిన వారు దాదాపు 5 వేల మందికి పైగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నోటిఫికేషన్లు విడుదల చేస్తారని వారంతా ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో రూంలు అద్దెకు తీసుకొని వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారు. అయితే నెలలు గడుస్తున్నా నోటిఫికేషన్లపై ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో వారిలో ఆశలు సన్నగిల్లుతున్నాయి. ముఖ్యంగా అధిక శాతం అభ్యర్థులు నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు కావడంతో అద్దెలు, కోచింగ్ ఫీజు చెల్లించడానికి నానా అవస్థలు పడుతున్నారు.

ఇంటికో ఉద్యోగం ఎక్కడ..

ఎన్నికల ప్రచార సమయంలో కూటమి పార్టీ నేతలు ఇంటికో ఉద్యోగం, అప్పటివరకూ నిరుద్యోగభృతి ఇస్తామని ఊదరగొట్టారు. మండలవ్యాప్తంగా 15 సచివాలయాలు, 24 గ్రామాలు ఉండగా 8540 గృహాలు ఉన్నాయి. ఈ లెక్కన చూసినా మండలంలో వేల ఉద్యోగాలను ప్రభుత్వం చూపించాల్సి ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేదంటూ అడపాదడపా పాలకులు చేస్తున్న ప్రకటనలపై నిరుద్యోగుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను క్రమంగా ప్రజల నుంచి దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా అంటూ చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ కొలువుల కోసం యువత శిక్షణ తీసుకునేందుకు కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయల ఫీజులను చెల్లిస్తున్నారు. షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ శిక్షణకు రూ.20 వేల నుంచి రూ.లక్ష వరకు కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ఉద్యోగాల నోటిఫికేషన్లకు నీళ్లల్లా డబ్బులు ఖర్చు చేసుకుని కోచింగ్ తీసుకోవాల్సి వస్తుందని నిరుద్యోగులు వాపోతున్నారు. నోటిఫికేషన్ ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పుడు అప్పటి వరకు నిరుద్యోగ భృతి అయినా ఇవ్వాలని కోరుతున్నారు.

> **నారా లోకేష్..**
> ''కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు ఉద్యోగాలు కల్పించే బాధ్యత నేను తీసుకుంటా. మొత్తం 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తామని మాటిస్తున్నా.. ఇంటింటికో ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తాం. ఉద్యోగం వచ్చేంత వరకు అర్హులైన నిరుద్యోగులందరికీ నెలకు మూడువేల రూపాయలు నిరుద్యోగ భృతి అందజేస్తామని ప్రకటిస్తున్నా..ఈ హామీ అమలును నేను బాధ్యతగా తీసుకుంటా''

ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి



మాది సిద్ధాపురం గ్రామం. నేను డిగ్రీ పూర్తి చేసి 12 యేళ్లు అయ్యింది. నా వయస్సు 34 సంవత్సరాలు. ఇప్పటి వరకు డిగ్రీ పూర్తి చేసిన వారికి నిరుద్యోగిభృతి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి నిరుద్యోగభృతి అందించాలి.

– మునిస్వామి, గ్రాడ్యుయేట్, సిద్ధాపురం గ్రామం

వయో పరిమితిపై ఆందోళన..

నిరుద్యోగభృతి అమలుకు 22 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్న వాళ్లు మాత్రమే అర్హులని లీకు లిస్తున్నారు. ఈ పరిధిని కనుక అమలు చేస్తే అనర్హులుగా మిగిలిపోతామని చాలామంది ఆందోళన చెందుతున్నారు. 22 యేళ్లలోపు వారు ఐటీఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు పూర్తి చేసి ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్నారు. మొత్తానికి వందలో 30 శాతం మంది అనర్హులుగా మిగిలే అవకాశం ఉంది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


కూరగాయలను పంపిణీ చేస్తున్న తహసీల్దార్ లోకేశ్వరయ్య

దేవనకొండ: ప్రకృతి వ్యవసాయంపై ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ లోకేశ్వరయ్య సూచించారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఈ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను రైతులకు పంపిణీ చేశారు. ఇలాంటి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. మనీ రూరల్ ఎక్స్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఐసీఆర్‌పీఎస్ అధ్యక్షులు సురేంద్ర, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విధుల్లో చేరిన డీఎల్‌డీవో


బాధ్యతలు స్వీకరిస్తున్న పి.అనురాధ

పత్తికొండ(తుగ్గలి) : డివిజనల్ లెవెల్ డెవలప్‌మెంట్ అధికారిణి (డీఎల్‌డీవో) గా పి.అనురాధ నియమితులయ్యారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న ఆమె బదిలీపై పత్తికొండకు వచ్చారు. ఈ మేరకు ఆమె సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓ స్వర్ణలత, కార్యాలయ సిబ్బంది డీఎల్‌డీవోకు స్వాగతం పలికారు.

అక్రమ లేఅవుట్లను తొలగించాలి

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్లను తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి రవి కోరారు. ఈ మేరకు..సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. పంచాయతీ అనుమతులు, ఎన్‌ఓ లేకుండా రైతులను మభ్యపెడుతూ వెంచర్లు వేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు.

పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

వెల్దుర్తి: మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, సీపీఐ, ఏఐఎస్‌ఎఫ్, రైతు సంఘం ప్రతినిధులు డి.రాజు, చిన్నమాదు లు, రాజు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావేదిక కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతి పత్రం అందించారు. ముఖ్యంగా బింగిదొడ్డి గ్రామ పరిధిలోని వీసీ కంపెనీలో నిర్వహిస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీపై పలు ఫిర్యాదులు ఉన్నాయని, రిజిస్ట్రేషన్లు లేకుండా, కార్మికుల హక్కులను కాలరాస్తూ, పలు ఫ్యాక్టరీలు అనుమతులు లేకుండా, నిబంధనలు పాటించకుండా చేస్తున్న ప్రజా, ప్రభుత్వ ధన దోపిడీపై చర్యలు తీసుకోవాలని అందులో పేర్కొన్నారు. అలాగే పొగాకు సాగు చేస్తే తామే మంచి ధరకు కొంటామంటూ చెప్పిన కొనుగోలుదారులు ప్రస్తుతం పలు కొర్రీలు పెట్టి తక్కువ ధరకు కొంటున్నారని, బ్రహ్మగుండం వద్ద పొగాకు గోడౌన్లు ఏర్పాటు చేసుకుని మరీ రైతులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. విచారించి చర్యలు తీసుకోనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి ఎవరో త్వరగా తేల్చండి

దేవనకొండ: ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి ఎవరో ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరగా తేల్చాలని, లేదంటే పార్టీ నాయకులు చాలా నష్టపోతారని వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ పార్టీ అధిష్టాన్ని కోరారు. దేవనకొండలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు ''మేం నాయకులం' అని చెప్పుకుంటూ తిరుగుతున్నారన్నారు. దానిని తాము సహించేది లేదన్నారు.

టీకాలతో పశువులకు రక్షణ


ముక్కెల్లలో పశువులకు టీకా వేస్తున్న దృశ్యం

పత్తికొండ/తుగ్గలి: టీకాలు వేయించడం ద్వారా పశువులకు వ్యాధులు సోకకుండా ఉంటాయని పశు వైద్యాధికారులు అన్నారు. సోమవారం పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ, దూదేకొండ, తుగ్గలి మండలం ముక్కెల్ల, రాతనలో పశు వైద్యాధికారులు లక్ష్మణ్, స్వర్ణలత, బాలకృష్ణ, ప్రణీత ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరాలను నిర్వహించారు. పశు వైద్యాధికారులుజీవాలకు బొబ్బరోగ నివారణ మందులు, పశువులకు నట్టల నివారణ మందులు వేశారు.కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి: స్థానిక ఎస్సీ కాలనీలో వెల్దుర్తి పశువైద్యాధికారి డాక్టర్ ఐఏ శాంతలత ఆధ్వర్యంలో పుల్లగుమ్మి వైద్యశాల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల పరిధిలోని గొర్రెలు, మేకలు, ఆవులు, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. పశు వైద్య సిబ్బంది, పశుపోషకులు పాల్గొన్నారు. షెడ్యూల్ మేరకు ఈనెల 21న గోవర్ధనగిరి గ్రామంలో డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో, మల్లెపల్లె గ్రామంలో డాక్టర్ ఐఏ శాంతలత ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించనున్నారు.

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం


జూటూరులో రీ సర్వే ప్రారంభిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి) : ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిందని ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని జూటూరులో రీ సర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..పైలెట్ ప్రాజెక్టుగా మండలానికి ఒక గ్రామం చొప్పున రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రీ సర్వే పకడ్బందీంగా చేపట్టాలని ఆదేశించారు. రీ సర్వేకు రైతులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీ సర్వే డీఐ దేవేంద్రప్పస్వామి, మండల సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో వాసుదేవయ్య, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

తుగ్గలి మండలంలో..
మండలంలోని పగిడిరాయిలో రీ సర్వే కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి ప్రారంభించారు. సర్వేతో రైతులకు కలిగే లాభాలను వివరించారు. మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వో నయోమి, పంచాయతీ కార్యదర్శి రాజునాయక్, వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వెల్దుర్తి: మండలంలో గోవర్ధనగిరి రెవిన్యూ గ్రామం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి సోమవారం ప్రారంభించింది. మండల సర్వేయర్ హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో విలేజ్ సర్వేయర్లు, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొనగా ఒక టీమ్ గోవర్ధనగిరి సర్వే నంబర్ 1 నుంచి, మరో టీమ్ మజరా గ్రామం చెర్లకొత్తూరు గ్రామ పొలిమేర నుంచి రీసర్వేను ప్రారంభించారు. గోవర్ధనగిరి రెవెన్యూ పరిధిలోని 6,334.42 ఎకరాల రీసర్వే చేయనున్నట్లు మండల సర్వేయర్ తెలిపారు. రోవర్లు ఇంకా అందలేదని, అందిన వెంటనే మరిన్ని టీమ్‌లతో రీసర్వే వేగవంతం చేస్తామన్నారు. ప్రారంభ కార్యక్రమంలో విలేజ్ సర్వేయర్లు నాయక్, బిందు, నాగార్జున, నవీన్, ఉష, రాజశేఖర్, వీఆర్‌ఓలు ఉమ్మన్న, ఉమ, జయేంద్ర, రైతులు పాల్గొన్నారు.

మద్దికెర : భవిష్యత్‌లో భూసమస్యలు రాకుండా చేపట్టిన భూసర్వే పక్కాగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలో భూసర్వే కార్యక్రమాన్ని సర్పంచ్ మల్లికార్జున ప్రారంభించారు. రెవెన్యూ అధికారులు రోజుకు 20 ఎకరాలు సర్వే చేయాలని సూచించారు. వీఆర్వోలు బాలవర్ధిరాజు, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

హాలహర్వి: పచ్చారపల్లి గ్రామంలో సోమవారం రీ సర్వే కార్యక్రమాన్ని తహసీల్దార్ నజ్మాబాను ఆధ్వర్యంలో చేపట్టారు. సర్వేయర్ మంజుభార్గవి, వీఆర్వోలు సతీష్, రాఘవేంద్ర, రెవెన్యూ సిబ్బంది వీరాంజనేయులు, రోజా, నాయకులు పాల్‌రెడ్డి, హాలహర్వి సర్పంచ్ మల్లికార్జున పాల్గొన్నారు.

సమాచారమివ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారు?


సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తున్న ఏఓ రవి

మద్దికెర : సభ్యులకు సమాచారం ఇవ్వకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులువురు సభ్యులు మాట్లాడుతూ గతంలో ఫోన్ ద్వారా లేదా సర్క్యులర్ ఇచ్చి సమావేశం గురించి తెలియజేసేవారన్నారురు. ప్రస్తుతం అవేవీ పాటించడం లేదన్నారు. ఇష్టానుసారంగా చేసుకునేటప్పుడు ఎందుకు సమావేశాలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. అలాగే మండలానికి ఎన్ని నిధులు వచ్చాయి వాటిని దేనికి వినియోగిస్తున్నారో తెలియడం లేదన్నారు. తామేము గెలిచిన ప్రాంతంలో పనులు చేయడానికి కూడా వీలులేకుండా పోయిందన్నారు. పంచాయతీ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా రోడ్లు వేస్తున్నారని ఎం.అగ్రహారం సర్పంచ్ విజయుడు మండిపడ్డారు. ఒక్కోచోట ఒక్కోరకంగా రోడ్లు వేస్తున్నారన్నారని.. ప్రశ్నిస్తే అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే సర్పంచులు ఎందుకని నిలదీశారు. అనంతరం ఎంపీడీఓ కొండయ్య మాట్లాడుతూ.. ఇకముందు అలా జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమావేశంలో ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీటీసీలు లత, ఆంజనేయులు సర్పంచులు సుహాసిని, రాజగోపాల్‌రెడ్డి, ఏఓ రవి, ఏఈలు మయాంక్, ఉమాకాంత్, విష్ణు, ఈఓలు సుధాకర్, శివకుమార్, హరికృష్ణ, పరమేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సౌభాగ్యలక్ష్మి, త్రివేణి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

మద్దికెర : గ్రామాల్లో నిర్వహించే పశు వైద్యశిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి కృష్ణానాయక్ అన్నారు. సోమవారం ఎడవలి గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహించి 85 పశువులకు టీకాలు, జీవాలకు నట్టల నివారణ మందులు వేశామన్నారు. మంగళవారం బసినేపల్లిలో శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పారు.

హాలహర్వి:పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసు కోవాలని ఆదోని పశువైద్య కేంద్రం ఉప సంచాలకులు డాక్టర్ వెంకటరమణ, ఆస్పరి సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం హాలహర్విలో శిబిరాన్ని ప్రారంభించారు. ఈనెల 21న బాపురం, చింతకుంట, 22న హర్ధగేరి, 23న మెదేహాల్, నిట్రవట్టి, 24న బిలేహాల్, ఎం.కె.పల్లి, 25న మాచనూరు, సాకిబండ, 27న విరుపాపురం, కామినహాల్, 28న కొక్కరచేడు, బేవినహాల్, 29న సిద్ధాపురం గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

రైతు డైరీ ఆవిష్కరణ

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక చదువుల రామయ్య భవన్‌లో సోమవారం రైతన్న డైరీని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుండటంతో రైతులు ఉద్యమిస్తున్నారన్నారు. కనీస మద్దతుధర చట్టం తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు


గ్యాస్ సిలిండర్‌ను సీజ్ చేసిన అధికారులు

వెల్దుర్తి: శ్రీరంగాపురం గ్రామ రేషన్ షాపును, మండల కేంద్రంలోని గౌతమ్, రాయల్‌మీల్స్ హోటళ్లలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ తహసీల్దార్ వెంకటనారాయణ, సీఐ పవన్ కిశోర్ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో రేషన్ షాపు నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా హోటళ్లలో గృహ అవసరాల గ్యాస్ సిలిండర్ల వినియోగాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఇన్‌చార్జ్ ఆర్ఐ ప్రసాద్, వీఆర్‌ఓ జయేంద్ర, గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది సమక్షంలో పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

మామిడి చెట్లపై మందుల పిచికారీ..రాలిపోయిన పూత


అరికెర గ్రామంలోని మామిడి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గ్రామానికి చెందిన రైతు కోనేటి ఈరన్న 1.5 ఎకరాల్లో మామిడి చెట్లు సాగు చేశాడు. ఇటీవల మామిడి పూత రాలుతోందని ఆలూరులోని ఓ ఫర్టిలైజర్ షాపులో ఫ్రైడ్, కంట సూపర్, బోరాన్ మందులు కొనుగోలు చేసి పంటపై పిచికారీ చేయడంతో అప్పటి వరకు ఉన్న పూతంతా రాలిపోయి ఆకులపై మచ్చలు ఏర్పడ్డాయి. సంబంధిత షాపు యజమాని, మందుల కంపెనీపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగా సోమవారం ఏడీఏ సునీత, హార్టికల్చర్ అధికారిణి శ్రీవాణి, ఏఓ వెంకటేశ్వర గౌడ్ మామిడి చెట్లను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. రైతు మోతాదుకు మించి మందు పిచికారి చేశారన్నారు. పూత దశలో ఎలాంటి మందులు పిచికారీ చేయరాదన్నారు. అవసరమైతే అధికారుల సూచన మేరకు పిచికారీ చేయాలన్నారు. మొక్కలు పుంజుకోవడానికి 10 గ్రాముల 130045 మందును ఒక లీటరు నీటిలో సూక్ష్మ పోషకాల మిశ్రమం 5 గ్రాములు 1 లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రాలిన పూత తిరిగి రాదని, మిగిలిన పూతకు ఎలాంటి నష్టం వాటిల్లదని చెప్పారు. రైతు ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేత గోరంట్ల జట్టు


విజేత గోరంట్ల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

వెల్దుర్తి: స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి సూపర్–8 క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కోడుమూరు మండలం గోరంట్ల జట్టు నిలిచింది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి హైస్కూల్ 2000–01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు,సురేశ్–11 టీమ్ సంయుక్తంగా నిర్వహించిన టోర్నీలో 32 జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఫైనల్ పోటీలో గోరంట్ల జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని ప్రత్యర్థి వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టుకు 60 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ప్రత్యర్థిజట్టు 40 పరుగులకు ఆలౌట్ కావడంతో గోరంట్ల విజేతగా నిలిచింది. విన్నర్స్‌కు రూ.20వేల నగదు, ట్రోఫీ, రన్నర్స్‌కు రూ.10వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందించారు. బెస్ట్ పెర్‌ఫార్మెన్స్‌గా వెల్దుర్తి గట్టి ఎలెవెన్ జట్టు సభ్యుడు అనూప్ ప్రత్యేక ట్రోఫీ అందుకున్నాడు. నిర్వాహకులు సురేశ్, శ్రీను, సుమన్, రాహుల్, సూరి పాల్గొన్నారు.

కుష్టు లక్షణాలపై సర్వే చేయాలి


కుష్టు వ్యాధి లక్షణాలను పరిశీలిస్తున్న డిప్యూటీ పారామెడికల్ అధికారి గురుప్రసాద్

ఆలూరు: కుష్టు వ్యాధి లక్షణాలపై సమగ్రంగా సర్వే చేసి వ్యాధి నిర్మూలనకు చర్యలు తీసుకోవలసి బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని డిప్యూటీ పారామెడికల్ అధికారి గురుప్రసాద్ సూచించారు. సోమవారం జాతీయ కుష్టు వ్యాధి దినోత్సవ నిర్మూలన కార్యక్రమాన్ని మొలగవెల్లి గ్రామ రోడ్డు సమీపంలో ఉన్న సబ్ సెంటర్ ఆవరణలో మొలగవెల్లి పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ మల్లేశ్వరి ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 2వ తేదీ వరకు గ్రామాలో సర్వే చేయాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మహ్మద్‌బాషా,ఎంపీహెచ్‌ఓలు ఆంథ్రూస్, కళావతి పాల్గొన్నారు.